# సింగరేణి భూగర్భ గనుల ప్రైవేటీకరణ వార్తలు పూర్తిగా అవాస్తవం

- భూగర్భ గనులను ప్రైవేటీకరించే ప్రతిపాదన ఏదీ లేదు
- సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ

**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 02 (తెలంగాణ వాణి)**

సింగరేణి భూగర్భ బొగ్గు గనులను ప్రైవేటుపరం చేస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. సింగరేణి భూగర్భ గనులను ప్రైవేటీకరించేందుకు ప్రస్తుతం సంస్థ వద్ద ఎటువంటి ప్రతిపాదన పరిశీలనలో లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన ప్రభుత్వ రంగ సంస్థగా, మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ గనులు, 17 ఓపెన్‌కాస్ట్ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. తెలంగాణతో పాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు బొగ్గును సరఫరా చేస్తూ దేశ ఇంధన భద్రతకు, పారిశ్రామిక అభివృద్ధికి నిరంతరం తోడ్పడుతున్నట్లు వెల్లడించింది.

**నష్టాల్లో ఉన్నా భూగర్భ గనుల కొనసాగింపు**

సింగరేణిలోని భూగర్భ గనులు ఆర్థికంగా నష్టాల్లో ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రాంతంలో ఉపాధి కల్పన, ఉద్యోగ భద్రతను దృష్టిలో ఉంచుకుని నష్టాలను సాధ్యమైనంత మేర తగ్గిస్తూ వాటిని కొనసాగిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.

భూగర్భ గనులను మూసివేయడం లేదా ప్రైవేటుపరం చేయడం కాకుండా వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, నిర్వహణ వ్యయాలను తగ్గించడం ద్వారా సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది.

**శాంతిఖని గనిపై ఈఓఐ కేవలం పైలట్ అధ్యయనం కోసమే**

భారీ నష్టాల్లో కొనసాగుతున్న శాంతిఖని భూగర్భ గనిలో ఉత్పత్తి కార్యకలాపాలను ఎండీఓ (మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్) విధానంలో నిర్వహించడం ద్వారా ఉత్పత్తి వ్యయాలను తగ్గించగలమా, నష్టాలను నివారించగలమా అనే అంశాన్ని అధ్యయనం చేసేందుకు మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా ఒక ప్రతిపాదనను రూపొందించినట్లు



యాజమాన్యం వివరించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి 2వ తేదీన ఈఓఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్) ప్రకటన జారీ చేసి, ఆసక్తిగల సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించడం జరిగింది. తొలుత జనవరి 15వ తేదీ వరకు గడువు ఇవ్వగా ఏ సంస్థ కూడా ఆసక్తి వ్యక్తం చేయలేదు. అనంతరం గడువును జనవరి 22వ తేదీ వరకు పొడిగించగా ఒక సంస్థ మాత్రమే ముందుకొచ్చింది. అయితే తదుపరి దశలో ఆ సంస్థ కూడా ఈ ప్రక్రియలో కొనసాగేందుకు సంసిద్ధత వ్యక్తం చేయలేదు. ఈ ప్రతిపాదనకు తగిన స్పందన లభించకపోవడంతో దానిని విరమించుకున్నట్లు సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. శాంతిఖని గనికి సంబంధించి జారీ చేసిన ఈఓఐని ఆధారంగా చేసుకుని సింగరేణి భూగర్భ గనులను ప్రైవేటుపరం చేస్తోందని ప్రచారం చేయడం వాస్తవ విరుద్ధమని యాజమాన్యం పేర్కొంది. శాంతిఖని గనికి సంబంధించిన ఈఓఐ ప్రక్రియను కూడా ఇప్పటికే విరమించుకున్నామని తెలిపింది. భూగర్భ గనులను మరింత సమర్థ వంతంగా నిర్వహించడం, నష్టాలను తగ్గించడం, సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చడం ద్వారా తెలంగాణ ప్రాంతంలో ఉపాధి అవకాశాలను పరిరక్షించడంతో పాటు భవిష్యత్తులో మరింత ఉపాధి కల్పించడమే సింగరేణి యాజమాన్యం ప్రధాన లక్ష్యమని పేర్కొంది.

**వాస్తవాలను**

నిర్ధారించుకోకుండా ఇటువంటి వార్తలను ప్రచారం చేయడం వల్ల ఉద్యోగులు, వారి కుటుంబాలు, ప్రజల్లో అనవసర ఆందోళన ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.

# శిరీష కేసును వీసీ సజ్జనార్‌కు అప్పగించాలి

- రెడ్డి సామాజిక వర్గానికి ఓ న్యాయం.. గిరిజన బిడ్డకు ఇంకో న్యాయమా?
- శిరీష ఘటనపై ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు స్పందించాలి
- నిందితుడి సామాజిక వర్గమే అతనికి రక్షణ కవచంగా మారుతోందా?
- మహిళల భద్రతపై ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు

**తెలంగాణ వాణి, సెప్టెంబర్ 02 (భద్రాద్రి బ్యూరో అఫ్జల్ పఠాన్)**

ఓ దుర్మార్గుడి కామ దాహానికి ఒక యువతి ప్రాణం పోయింది. ఓ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఆ గిరిజన కుటుంబం కన్నీటిలో మునిగిపోయింది. అయినప్పటికీ న్యాయం కోసం ఆ కుటుంబం ఎదురుచూడాల్సిందేనా? నేరం చేసిన వ్యక్తి సామాజిక వర్గం ప్రభావవంతమైనదైతే చట్టం నెమ్మదిస్తుందా? బాధితురాలు గిరిజన బిడ్డ కాబట్టి న్యాయం కోసం వాళ్ళు మరింత పోరాడాల్సిందేనా? ఇవే ఇప్పుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల్లో, గిరిజన సంఘాల్లో వినిపిస్తున్న ప్రశ్నలు. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువతి, నర్సు ఊకే శిరీష దారుణ హత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఘటనపై మంత్రి సీతక్క డీజీపీతో మాట్లాడి ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించాలని సూచించడంతో పాటు బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించారు. నిందితుడికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కుటుంబానికి ఆర్థిక సాయం, వ్యవసాయ భూమి, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని కూడా ప్రకటించారు.

**అయితే.. హామీలతో సమస్య ముగిసిపోతుందా? న్యాయం జరిగేందుకు ప్రభుత్వం ఎలా బాధ్యత తీసుకుంటుంది? అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.**

**సామాజిక వర్గం.. రక్షణ కవచమా?**

నేరానికి కులం, మతం, ప్రాంతం ఉండకూడదు. నిందితుడు ఏ సామాజిక వర్గానికి చెందినవాడైనా చట్టం ముందు సమానమే. అదే సమయంలో బాధితురాలి సామాజిక నేపథ్యం ఆధారంగా న్యాయ ప్రక్రియలో ఎలాంటి తేడా ఉండకూడదు. కానీ.. ప్రభావవంతమైన సామాజిక వర్గానికి చెందిన నిందితుల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు పనిచేస్తున్నాయా? అనే అనుమానాలు ప్రజల్లో తలెత్తితే వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. శిరీష కేసులో కూడా దర్యాప్తు పూర్తిగా పారదర్శకంగా సాగాలని,




ఎలాంటి రాజకీయ లేదా సామాజిక ఒత్తిళ్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని గిరిజన, మహిళా సంఘాలు కోరుతున్నాయి. నిందితుడి సామాజిక నేపథ్యం ఏదైనా.. బాధితురాలు గిరిజన బిడ్డ అయినా.. న్యాయం మాత్రం ఒక్కటే కావాలి.

**ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు ఏమంటారు?**

శిరీష భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిడ్డ. ఆమె కుటుంబానికి న్యాయం చేయాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులపైనా ఉంది. మంత్రి సీతక్క కుటుంబాన్ని పరామర్శించి భరోసా ఇచ్చినప్పటికీ, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధుల వైఖరి స్పష్టంగా ఉండాలన్న డిమాండ్ వినిపిస్తోంది. గిరిజన బిడ్డ ప్రాణం పోయినప్పుడు జిల్లా నాయకత్వం మొత్తం స్పందించి బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించడంతో పాటు.. కేసు దర్యాప్తు పురోగతి, న్యాయపరమైన చర్యలపై ప్రభుత్వం ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం చేరవేసేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

**మహిళలకు భద్రత ఎక్కడ?**

రాష్ట్రంలో మహిళలపై నేరాలు చోటుచేసుకుంటున్న ప్రతిసారీ ప్రభుత్వం స్పందించడం, నిందితులను అరెస్టు చేయడం మాత్రమే సరిపోదని మహిళా సంఘాలు అంటున్నాయి. నేరాలు పునరావృతం కాకుండా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెబుతున్నాయి. ముఖ్యంగా నగరాల్లో ఉద్యోగాలు, చదువుల కోసం వెళ్లే గ్రామీణ, గిరిజన యువతుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని శిరీష ఘటన మరోసారి గుర్తు చేస్తోంది. గిరిజన యువతుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపడతామని మంత్రి సీతక్క ప్రకటించడం ఈ నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది.

**పూర్తిస్థాయి హోంశాఖ మంత్రి లేకపోవడమే కారణమా?**

రాష్ట్రంలో శాంతిభద్రతలు, మహిళల భద్రతపై చర్చ జరుగుతున్న వేళ.. పూర్తిస్థాయి హోంశాఖ మంత్రి కావాలనే? ప్రశ్న కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. హోంశాఖపై నిరంతర పర్యవేక్షణ, పోలీసు వ్యవస్థకు సమన్వయం, మహిళలు--బలహీన వర్గాలపై నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే శిరీష ఘటనకు నేరుగా హోంమంత్రి లేకపోవడమే కారణమని నిర్ధారించే ఆధారాలు లేనప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే పనిలో బిజీగా ఉండటం వంటి ప్రభుత్వ పాలనా పరమైన పాలసీ విధానం పట్ల రాజకీయంగా లేవనెత్తుతున్న ప్రశ్నగా మాత్రమే చూడాలి.

**న్యాయం.. నిందితుడి సామాజిక వర్గాన్ని చూసి మారకూడదు**

శిరీషకు జరిగిన అన్యాయం మరో కుటుంబానికి జరగకూడదంటే కఠినమైన చట్టపరమైన చర్యలతో పాటు వ్యవస్థాగత మార్పులు అవసరం. రెడ్డి అయినా.. గిరిజనుడైనా.. దళితుడైనా.. మైనారిటీ అయినా.. నిందితుడు చట్టం ముందు నిందితుడే. బాధితురాలు ఏ సామాజిక వర్గానికి చెందినదైనా.. ఆమెకు న్యాయం అందాల్సిందే.

**ప్రజల డిమాండ్ ఒక్కటే**

మారుమూల పల్లెలో పుట్టి పెరిగి కుటుంబ పోషణ కోసం ఎన్నో ఆశలతో రాజధాని నగరంలో ఉద్యోగం చేస్తు దుర్మార్గుడి అకృత్యానికి బలైన శిరీష ఆత్మకు శాంతి దొరకాలంటే సజ్జనార్ సార్ రావాలి. వరంగల్ యాసిడ్ దాడి ఘటన సమయంలో స్వప్నిక, ప్రణీతల విషయంలో, షాద్ నగర్ టోల్ ప్లాజా ఘటన బాధితురాలు దిశ (ప్రియాంక రెడ్డి) విషయంలో ఎం జరిగిందో అదే విధంగా తుక్కుగూడ నర్సు శిరీష హత్యచారం కేసులో నిందితుడు కారు మెకానిక్ మహ్మద్ సనావుల్లా ఖాన్ (సైనా ఉల్లా) ను ఎన్కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**సామాజిక వర్గం చూడొద్దు.. రాజకీయ పలుకుబడి చూడొద్దు..**

నేరం చేసినవారికి చట్టప్రకారం కఠిన శిక్ష విధించండి. శిరీష కుటుంబానికి సంపూర్ణ న్యాయం చేయండని విద్యార్థి, మహిళా సంఘాలతో పాటు రాజకీయ పార్టీలు సైతం డిమాండ్ చేస్తున్నారు.

# శిరీష హంతకుడిని కఠినంగా శిక్షించాలి

- మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి..
- గిరిజన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**కొత్తగూడెం, సెప్టెంబర్ 2 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

ఆదివాసీ యువతి ఊకె శిరీషపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పోస్టాఫీస్ నుంచి బస్టాండ్ మీదుగా అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ చేపట్టి నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కె. ఫహీమ్ దాదా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్ మాట్లాడుతూ ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లిన శిరీష విగతజీవిగా తిరిగి రావడం తీవ్ర విషాదకరమన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడేలా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రత కోసం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కోరారు. ాార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనముల సాయి, సహాయ కార్యదర్శి ఎస్.కె. ఖయ్యుమ్, రవికిరణ్, నాదీమ్, కోచ్చెర్ల రాకేష్, జావీద్, కొయ్యడ రవి, శివ, బాబా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కోరిమి సంజయ్, చిన్ను, అజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

